
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 7 ఏప్రిల్ 2024
5





రంజాన్‌వేళలు



ఇఫ్తార్ (సా) : 6:28 (ఆదివారం)
సహర్ (ఉ) : 4:36 (సోమవారం)



వైరాలో బీఆర్ఎస్ రైతు దీక్షలో పాల్గొన్న ఎంపీలు నామా, వద్దిరాజు

హామీలు అమలు చేయాలి...

- రైతు దీక్షలో బీఆర్ఎస్ నేతల డిమాండ్
- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా దీక్షలు
- హాజరైన ఎంపీలు నామా, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

6



భద్రాద్రి శ్రీరామనవమి వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక

శ్రీరామనవమికి విస్తృత ఏర్పాట్లు

- 26 సెక్టార్లుగా కల్యాణ మండపం
- తలంబ్రాల పంపిణీకి 60 కౌంటర్లు
- అధికారులతో సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

6

ఆర్టీసీ ఆదాయం.. ల‘హరి’

- ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు భిన్న చార్జీలు
- ఆన్‌లైన్‌లో తక్కువగా చూపుతున్న రేట్లు
- గరుడ కన్నా చౌకగా ధరలుండటంతో సంస్థకు నష్టం

6



- రుణాల పేరిట సామాన్యుల ప్రాణాలతో చెలగాటం
- వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్న రికవరీ ఏజెంట్లు
- పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలే టార్గెట్
- యథేచ్ఛగా వడ్డీ వసూళ్లు.. నిబంధనల ఉల్లంఘన
- ఖమ్మంలో యువకుడి మృతితో మరోసారి తెరపైకి వచ్చిన ఆగడాలు



ఇష్టారాజ్యంగా ‘ఫైనాన్స్’ దందా

పుట్టగొడుగుల్లా టూ వీలర్, ఆటో ఫైనాన్స్ సంస్థలు

అడిగిందే తడవుగా వాళ్లు రుణాలు ఇచ్చేస్తారు... ఇష్టారీతిన వడ్డీలు విధించి వాయిదాల రూపంలో వసూలు చేస్తారు. ఒక్క వాయిదా చెల్లించకపోయినా నరరూప రాక్షసుల్లా ప్రవర్తిస్తారు. భరించలేని వేధింపులకు గురిచేసి, నలుగురిలో పరువు తీసి తీవ్ర మనస్తాపానికి లోను చేస్తారు. సున్నిత మనస్కులు వీరి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, సామాన్యులు మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఖమ్మంలో శుక్రవారం వినయ్ అనే యూపీ యువకుడు ఫైనాన్స్ కంపెనీ రికవరీ సిబ్బంది వేధింపులు భరించలేక ప్రాణాలు తీసుకున్న ఘటన ఈ దందా వికృత రూపాన్ని మరోసారి కళ్లకు కట్టింది. చట్టాలు, నిబంధనలను తుంగలో తొక్కి ఉమ్మడి జిల్లాలో ఫైనాన్స్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సామాన్యుల జీవితాలతో ఆటలాడుతున్నాయి. అంతేకాదు అటు కమర్షియల్ ట్యాక్సును, ఇటు ఇన్‌కమ్ ట్యాక్సును ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాయి. ప్రస్తుత మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ గతంలో జిల్లా ఎస్పీగా పని చేసినప్పుడు.. ఫైనాన్స్ కంపెనీలపై ఉక్కుపాదం మోపగా, అప్పుడు వీరి ఆగడాలకు చెక్ పడింది. ఆయన బదిలీ తర్వాత దందా మళ్లీ మొదలైంది.

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఈఎంఐ పద్ధతిలో సెల్‌ఫోన్ తీసుకోగా.. ఒక ఈఎంఐ చెల్లించకపోవడంతో సదరు కంపెనీ ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు నడిరోడ్డుపై నిలబెట్టి వేధించారు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దుమ్ముగూడెం మండలం గోవిందాపురానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ ద్వారా వరికోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. కొద్ది నెలలపాటు వాయిదాలు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు బకాయికోసం నిలదీసి యంత్రాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించడంతో మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో ఆటో కిస్తీ చెల్లించలేదని పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లే ఓ ఆటోను పట్టుకెళ్లారు. అయితే వారు ఆటోను మాత్రమే తీసుకెళ్తే పర్వాలేదు. కానీ సదరు ఆటో యజమాని పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో అడ్డగించి ఆటోతోపాటు విద్యార్థులను సైతం ఖమ్మంలోని తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. పిల్లలను సైతం తమ ఫైనాన్స్ కంపెనీలో కూర్చోబెట్టడం గమనార్హం. ఇక తాజాగా ఖమ్మంలో ఓ యువకుడిపై దాడి చేసి వెంబడించడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇవి కేవలం వెలుగులోకి వచ్చిన ఉదాహరణలు మాత్రమే.. ఇలాంటి ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల వేధింపులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిత్యం చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

రౌడీల్లా రెచ్చిపోతున్న రికవరీ ఏజెంట్లు

ఫైనాన్స్ ఇవ్వడం ఒక ఎత్తు అయితే, వాటిని తీసుకున్న వ్యక్తి సక్రమమైన పద్ధతిలో చెల్లించేలా అవగాహన కల్పించి వారి నుంచి నగదును రికవరీ చేయడం ఫైనాన్స్ కంపెనీలు చేయాల్సిన పని. కానీ పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు ఎలాంటి రికవరీ పద్ధతులను పాటించవు. తమ దగ్గర కఠినంగా వ్యవహరించేలా ఉండే పలువురు వ్యక్తులను రికవరీ ఏజెంట్లుగా నియమించుకుని వారిద్వారా సంబంధిత వ్యక్తులపై ఒత్తిడి తీసుకొచ్చి, వేధింపులకు గురిచేసి నగదు వసూలు చేసేలా సాధారణ, మధ్య తరగతి ప్రజలపై ఏజెంట్లను ఉసిగొల్పుతున్నారు.

కొందరు ఫైనాన్స్ వ్యాపారులు అయితే ఏకంగా నేరప్రవృత్తి ఉన్నవారికే ప్రాధాన్యం ఇచ్చి మరీ ఏజెంట్లను నియమించుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయా ఏజెంట్లు సైతం ఎవరైనా లోను చెల్లించాల్సి వస్తే.. నిత్యం వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఇబ్బందులకు గురిచేయడం, నడిరోడ్డుపై నిలబెట్టి మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించడం వంటి సంఘటనలకు పాల్పడుతున్నారు. పలు సందర్భాల్లో లోను నగదు చెల్లించని వారిపై చేయి చేసుకున్న సంఘటనలు లేకపోలేదు. ఈ క్రమంలోనే వారు చేసే వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. అయితే ఆయా సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల వద్దకు చేరినట్టయితే ఆ శాఖ అధికారులు కూడా ఇతర కేసులు మాదిరిగానే కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు ఆయా ఫైనాన్స్ కంపెనీలపై అధికారులు చూసిచూడనట్టు వ్యవహరించడంతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా ఫైనాన్స్ కంపెనీలు

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాస్తవానికి ఓ ప్రైవేటు ఫైనాన్స్

మిగతా 6వ పేజీలో...

గతంలో రంగనాథ్ కొరడా

ప్రస్తుత మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ గతంలో జిల్లాలో పనిచేసినప్పుడు అక్రమ ఫైనాన్స్‌లపై కొరడా ఝుళిపించారు. కాల్‌మనీ వ్యవహారం నుంచి మొదలుకుని పలు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, అక్రమంగా ఫైనాన్స్ నిర్వహిస్తున్న టూ వీలర్, ఆటో ఫైనాన్స్ వంటి పలు కంపెనీలపై దాడులు చేసి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసులు కూడా నమోదు చేశారు. ఆ సమయంలో భయపడిన అక్రమ ఫైనాన్సర్లు కొద్ది కాలం పాటు ఆగడాలను ఆపేశారు. ఆయన జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన తర్వాత మళ్లీ అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ వ్యాపారాలు ఊపందుకున్నాయి.



అక్రమ ఫైనాన్స్‌కు అడ్డుకట్ట వేయాలి

- రికవరీ ఏజెంట్లతోపాటు, ఫైనాన్సర్‌ను అరెస్ట్ చేయాలి
- నేర సమీక్షలో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్

6

వినయ్ మృతదేహం తరలింపు

నిప్పుల కుంపటి



- రెడ్‌అలర్ట్‌కు చేరువలో ఉమ్మడి జిల్లా
- రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వైనం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెళ్లపాడులో 44.5 డిగ్రీలు
- ఖమ్మం జిల్లా పమ్మిలో 44.3 డిగ్రీలు
- మధ్యాహ్నం 12 నుంచే నిర్మానుష్యం అవుతున్న రహదారులు
- పగటి వేళ బయటకు రావొద్దని ప్రజలకు వైద్యుల హెచ్చరిక

6



తాగునీటి గండం గట్టెక్కినట్టే..

- దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌కు చేరిన పాలేరు జలాలు
- ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడికి చెక్
- మంత్రి తుమ్మల చొరవ ఫలితం

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 6: ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడికి చెక్‌పడింది. పాలేరు జలాశయం నుంచి సాగర్‌జలాలు శనివారం సాయంత్రం దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌కు చేరాయి. ఖమ్మంనగరంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇటీవల సాగర్‌జలాలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఫోన్‌ద్వారా ఆదేశించారు. ఆ మేరకు ‘పాలేరు’కు సాగర్ జలాలను విడుదల చేశారు. పాలేరునుంచి నగరంలోని దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్‌కు 35మిలియన్ క్యూబిక్ ఫీట్ (ఎంసీఎఫ్‌టీ), లకారానికి 20ఎంసీఎఫ్‌టీ నీళ్లు చేరుతున్నాయి. దీంతో దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ ద్వారా నెలరోజుల వరకు నగరంలోని పలుప్రాంతాలకు తాగునీరు అందించవచ్చని పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్ తెలిపారు.





చికిత్స పొందుతున్న బాలకృష్ణ

ఛిద్రమైన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- తల్లి సహా ఇద్దరు బిడ్డలను బలి తీసుకున్న లారీ
- భర్తకు తీవ్రగాయాలు
- పెళ్లి వేడుకకు వెళ్లి వస్తుండగా మందలపల్లి వద్ద ప్రమాదం

దమ్మపేట, ఏప్రిల్ 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామసమీపంలో ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తల్లి చీపు లక్ష్మి(28), ఇద్దరు పిల్లలు శరణ్యశ్రీ(8), షణ్మిక(6) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. తండ్రి బాలకృష్ణకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, క్షతగాత్రుడు చీమల బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా ఏకొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీమల బాలకృష్ణ తన భార్య, కుమార్తెలతో కలిసి విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో బంధువుల వివాహానికి హాజరయ్యాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి అశ్వారావుపేట వస్తుండగా మందలపల్లి ప్రభు నర్సరీ సమీపంలో గుర్తు తెలియని కారు వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో వారు ద్విచక్రవాహనంతో సహా నలుగురు కిందపడిపోయారు. అదేసమయంలో సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపు వేగంగా వెళుతున్న లారీ రోడ్డుపైన పడిపోయిన వారి పైనుంచి దూసుకెళ్లింది. దీంతో లక్ష్మి, శరణ్య, షణ్మిక అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి బాలకృష్ణ రోడ్డు పక్కన పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలకృష్ణను 108 వాహనంలో దమ్మపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు.

వారం రోజుల క్రితం కుటుంబ పోషణ కోసం ఆంధ్రలోని చీమలపాడు గ్రామం నుంచి కుటుంబంతో సహా వచ్చిన బాలకృష్ణ అశ్వారావుపేట సమీపంలోని ఒక కోళ్ల ఫాంలో పనికి కుదిరారు. చంద్రుపట్లలో బంధువుల వివాహానికి హాజరై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- బీఆర్ఎస్ నేతల డిమాండ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా దీక్షలు

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి జిల్లాలో రైతు భరోసా దీక్షలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రైతు డిమాండ్లను ప్రధాన అస్త్రంగా చేసుకుని నియోజకవర్గాలలోని ముఖ్య మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు చేతబట్టి దీక్షలుచేపట్టారు. ఎండిపోతున్న పంటలకు ఎకరానికి రూ.25వేలు ఇవ్వాలని, రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలని, రైతు బంధు పెంచి అందించాలని తదితర డిమాండ్లతో దీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో కల్లూరు, వైరా, మధిర, వరంగల్ క్రాస్‌రోడ్, ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలంలో దీక్షలు సాగాయి. కల్లూరు, వైరాలో జరిగిన రైతు భరోసా దీక్షలో బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు ప్రసంగించారు. నామా ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పొలాలు ఎండిపోతూ రైతులు నష్టపోతున్నందున ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలని, అలాగే కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు పెంపు, ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ అందించాలన్నారు. సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని, సాగర్ జలాలతో ఖమ్మం జిల్లా చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో తెలంగాణ వాణి బలంగా ఉండాలంటే తెలంగాణ నుంచి బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాల్సిన అవసరం ప్రజలపై ఉందని కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీలు విస్మరించిందని, కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కల్లూరులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రసంగిస్తూ రైతులు గతంలో ఎన్నడూలేని విధంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, వేసినపంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడంలేదని, తక్షణం రుణమాఫీ అమలు చేయాలని, పంటల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన దీక్షలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని, రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. వైరాలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరులో మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, మధిరలో జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలంలో కూడా రైతు భరోసా దీక్షల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు వాతావరణ శాఖ ఒకట్రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతుండగా.. మరోవైపు భానుడు మాత్రం భగభగమంటున్నాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్ని మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాలు రెడ్ అలర్ట్‌కు చేరువలో వున్నాయి. ఏప్రిల్ నెల ప్రారంభం నుంచి మొదలుకుని రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్రంలో శనివారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన జిల్లాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉండడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని గరిమెళ్లపాడులో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, మల్కారం, అశ్వాపురం ప్రాంతాల్లో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ముదిగొండ మండలం పమ్మిలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కాగా ఖమ్మం జిల్లాలో అత్యల్పంగా పెనుబల్లి మండలం గౌరారం, కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడులో 23.1 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతే కాదు ఖమ్మం జిల్లాలోని ఒకటి రెండు మండలాలు మినహా మిగిలిన మండలాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పినపాక, కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, జూలూరుపాడు, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల్లో అత్యల్పంగా గాలుల్లో తేమ శాతం 10 నుంచి 20 శాతం మాత్రమే ఉన్నట్టుగా వాతావరణశాఖ ప్రకటించింది.

ఎండల తీవ్రత నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలోని 13 మండలాలు, ఖమ్మం జిల్లాలో 15 మండలాలు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్‌కు చేరువలో ఉన్నాయి. రెడ్ అలర్ట్ చేరువగా ఉన్న మండలాల్లో ఖమ్మం జిల్లాలోని సింగరేణి, కామేపల్లి, ఎన్కూరు, కొణిజర్ల, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వైరా, మధిర, ఎర్రుపాలెం, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం అర్బన్ ప్రాంతాలున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చర్ల, మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, టేకులపల్లి, కొత్తగూడెం, సుజాతనగర్, చుంచుపల్లి, చంద్రుగొండ, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు ఉన్నాయి.

భద్రాద్రి జిల్లాలో ఎల్లో ఎలర్ట్

కొత్తగూడెం కలెక్టరేట్: రోజు రోజకు పగటిపూట ఉష్ణోగ్రత పెరిగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు రోహిణి కార్తె రాకముందే దాని ప్రభావాన్ని అనుభవిస్తున్నారు. ఏప్రిల్ నెల ప్రారంభం నుంచి రోజు రోజుకు పగటిపూట ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. దీంతో పగటిపూట బయటకు వెళ్లాలంటే జనం భయపడుతున్నారు. వాతావరణ శాఖ జిల్లాలో ఎల్లో ఎలర్ట్ ప్రకటించింది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో సగటున 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందిన వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ మొదట్లోనే ఈ పరిస్థితి ఉంటే రాబోయే రెండు నెలల పాటు ఎండలు ఎంతగా బెంబేలెత్తిస్తాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. జనం వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 1న 41.3 డిగ్రీలు, 2న 42.7 డిగ్రీలు, 3న 42.8 డిగ్రీలు, 4న 42.1 డిగ్రీలు, 5న 42.8 డిగ్రీలు, 6న 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం జిల్లాలో 45.5 అత్యధిక ఉష్ణోగ్రత చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడు వద్ద నమోదైంది.



ఏపుగా ఎదిగిన పామాయిల్ తోట

24నెలలకే తొలిపంట..

కాపునకు వచ్చిన మంత్రి తుమ్మల పాయిల్ తోట

దమ్మపేట, ఏప్రిల్ 6: వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గండుగులపల్లి గ్రామంలో సాగు చేసిన పామాయిల్ తోట 24 నెలలకే తొలిపంట చేతికి వచ్చినట్లు ఆయిల్‌ఫెడ్ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఈనెల 9న కటింగ్ చేస్తామని తెలిపారు. ఈతోటను ఆయన శనివారం సందర్శించారు. తుమ్మల తాను సాగు చేస్తున్న 18ఎకరాల వరిపొలాన్ని 24 నెలల క్రితం దానిని చదును చేసి పామాయిల్ సాగుగా మార్చారు. దానిలో అంతర పంటలుగా పుచ్చసాగు చేసి అధిక దిగుబడులు సాధించారు. ప్రస్తుతం అంతర పంటగా కూరగాయిలు సాగు చేస్తున్నారు. ఈసందర్భంగా డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం అంతర పంటలకు సేంద్రియ ఎరువుల అధికపోషకాలు అందించటంతో త్వరిత గతిన పామాయిల్ కాపునకు వచ్చినట్లు తెలిపారు. సాధారణంగా పామాయిల్ మొక్క నాటిన తరువాత 36నెలలకు తొలి కాపు వస్తుందని అన్నారు. సేంద్రియ విధానలో సాగు చేయటంతో త్వరగతిన కాపునకు వచ్చినట్లు తెలిపారు.

అక్రమ ఫైనాన్స్‌కు అడ్డుకట్ట వేయాలి

- రికవరీ ఏజెంట్లతోపాటు, ఫైనాన్సర్‌ను అరెస్ట్ చేయాలి
- నేర సమీక్ష సమావేశంలో మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఫైనాన్స్ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం జరిగిన నేర సమీక్షా సమావేశానికి ఆయన తొలిసారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక వడ్డీల వ్యాపారాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కీమ్‌ల పేరుతో అమాయకుల నుంచి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా వేధిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయాలన్నారు.

నగరంలో శుక్రవారం బైక్ ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదని యువకుడిపై దాడి, దుర్మరణానికి కారణమైన ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లతోపాటు, ఫైనాన్సర్‌పై కూడా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. అక్రమార్జనకు అలవాటుపడిన భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న టెక్నాలజీ తగ్గట్టుగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లో అనాలసిస్ టీంను పటిష్టపరచాలన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘా

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తోన్న నేపథ్యంలో మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దు మార్గాల్లో ఏర్పాలు చేసిన చెక్‌పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందెళ్లాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, తద్వారా నేరాలు నియంత్రణలో ఉన్నాయన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరగకూడదన్నారు. దానిపై పటిష్ట నిఘా పెట్టి కట్టడి చేయాలన్నారు. రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు. సమీక్షలో భాగంగా ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న వ్యూహంపై, బందోబస్తు, శాంతిభద్రతలపై పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డీసీపీ గణేష్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, మౌనిక, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహమాన్, రఘు, శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, బోజరాజు, మల్లయ్య, ఫణీంద్ర, నర్సయ్య, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వినయ్ మృతదేహం తరలింపు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 6: ఫైనాన్స్ ఏజెట్ల దాష్టికానికి బలైన యువకుడు వినయ్ మృతదేహాన్ని అతడి సోదరుడు శనివారం సాయంత్రం ఉత్తరప్రదేశ్‌కు తరలించారు. బైక్ ఈఎంఐ చెల్లించలేదని ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినయ్‌ను ప్రైవేటు ఫైనాన్స్ ఏజెంట్లు రాళ్లతో వెంబడించటంతో భయంతో చెరువులో దూకి మృతిచెందిన సంఘటన విధితమే. కాగా మృతదేహానికి శనివారం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించటంతో ఖమ్మంలో ఉంటున్న అతని సోదరుడు స్వగ్రామానికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ఖమ్మం నుంచి ఉత్తరప్రదేశ్‌కు మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ఖర్చులు ఫైనాన్స్ కంపెని వారు చెల్లించినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న శీలం అజయ్‌కుమార్, రామచంద్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏవీ రంగనాథ్

భూకబ్జా గ్యాంగులను ఉపేక్షించవద్దు..

మల్టీజోన్-1 ఐజీపీ రంగనాథ్

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 6: వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం మల్టీజోన్-1 ఐజీపీ ఏవీ రంగనాథ్ నగరంలోని ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదులు చేసిన వారితో ఐజీపీ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. పోలీస్ అధికారులు స్పందించిన తీరును బాధితుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ దందాలతో బాధితులను బెదిరించి దౌర్జన్యాలు, దాడులు చేసేవారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సివిల్ కేసులని వదిలేస్తే కబ్జాలు, దాడులు పెరిగే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని అధికారులు గ్రహించి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీలు అవినాష్‌కుమార్, మౌనిక, టౌన్ ఏసీపీ రమణమూర్తి ఉన్నారు.

అటు జనజాతర.. ఇటు రైతు దీక్ష

ఖమ్మం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు ఎన్నికలకు సమాయాత్తం అవుతున్నారు. శనివారం అటు కాంగ్రెస్ పార్టీ జనజాతర పేరుతో తుక్కుగూడలో సభకు ఉమ్మడి జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. తుక్కుగూడ సభలో దశ, దిశ నిర్దేశించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ద్వారా కార్యకర్తలు, నాయకులను లోక్‌సభ ఎన్నికలకు కార్యోన్ముఖులను చేస్తుంది. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు తుక్కుగూడసభకు తరలగా శనివారం బీఆర్ఎస్ కూడా పోటీగా రైతు భరోసా దీక్షలు నిర్వహించింది. ఖమ్మం నియోజవర్గంలోని మంచుకొండ, పాలేరు నియోజకవర్గంలో వరంగల్ క్రాస్‌రోడ్డు, వైరా, కల్లూరు, మధిర కొత్తగూడెం, ఇల్లెందు అశ్వారావుపేట, మణుగూరు, భద్రాచలం నియోజకవర్గాల్లోను రైతు భరోసా దీక్షల పేరుతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీక్షలు చేస్తూ నినాదాలు చేశారు. ఎండిన పంటలకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలని, రూ.2 లక్షల రైతు రుణమాఫీ జరపాలని, ధాన్యానికి రూ..500బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు మదన్‌లాల్, హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, రేగా కాంతారావు ఆయా నియోజకవర్గ దీక్షల్లో పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా 'ఫైనాన్స్' దందా

(5వ పేజీ తరువాయి)

కంపెనీని నిర్వహించాలంటే దానికి సంబంధించిన ఫర్మ్ రిజిస్ట్రేషన్ చేయించడంతోపాటు, ఐటీ రిటర్న్‌లు, ట్రేడ్ లైసెన్సులు, లేబర్ లైసెన్సులు పొంది ఉండాలి. కాని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 150 వరకు టూవీలర్, ఆటో ఫైనాన్స్ కంపెనీలు ఉండగా.. వాటిల్లో కేవలం 30 నుంచి 40 శాతం మంది మాత్రమే నిబంధనలు ప్రకారం వ్యవహరిస్తోండగా.. మిగిలిన వారు అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి సెకండ్ హ్యాండ్‌లో టూవీలర్ కంపెనీలు నిర్వహించేవారు కేవలం మధ్యవర్తిగా ఉంటూ కమీషన్ అర్జిస్తూ ఉంటారు.

కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యాపారాన్ని నిర్వహించే పదుల సంఖ్యలో వ్యాపారులు ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా, అనుమతులు లేకుండా ఫైనాన్స్ వ్యాపారాన్ని కొనసాగిస్తూ అక్రమంగా రూ. కోట్లలో వెనకేసుకుంటున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. తమకు ఇష్టం వచ్చిన రీతిలో వడ్డీలు వేస్తూ, ఒకవేళ సరైన సమయానికి తమ వాయిదాను చెల్లించకపోతే దానికి వడ్డీలపై వడ్డీలు వేసి నడ్డి విరుస్తున్నట్టుగా తెలుస్తోంది. అంతే కాదు అక్రమంగా ఫైనాన్స్ దందా సాగించేవారికి నిరక్షరాస్యులు, రోజూవారి కూలీలు, సాధారణ, మధ్య తరగతి ప్రజలే టార్గెట్ అన్న వాదన లేకపోలేదు.

సంబంధిత యజమానులు ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా వ్యాపారాలు నిర్వహించే వారు తాము అర్జించే ఆదాయానికి అనుగుణంగా ఆదాయపన్ను చెల్లించాల్సి ఉండగా దాన్ని ఎగ్గొడుతున్నట్టుగా తెలుస్తోంది. దానితోపాటు వ్యాపారం నిర్వహించినదానికిగాను కమర్షియల్ ట్యాక్స్ చెల్లింపులు చేయాల్సి ఉంది. అయితే వ్యాపారులు మాత్రం తాము చేసే వ్యాపారంలో కేవలం 20శాతం మాత్రమే ట్యాక్స్ చెల్లిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని కంపెనీల వద్ద ఎలాంటి రికార్డులు లేకుండానే రూ. కోట్లలో వ్యాపారాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.



కార్యకర్తలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మం బైపాస్ రోడ్, ఏప్రిల్ 6: నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ కార్యకర్తలకు జిల్లా నాయకులు, పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయపార్టీగా బీజేపీ రూపుదిద్దుకోవడంలో కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. ఎంతో మంది ప్రాణత్యాగాలతో పార్టీ ఏర్పడిందన్నారు. 44ఏళ్ల క్రితం కొద్దిమందితో ఏర్పడిన పార్టీ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలున్న స్థాయికి ఎదిగిందన్నారు. కష్టపడే కార్యకర్తలకు బీజేపీలో సముచితస్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, జాల నరసింహారావు, అల్లిక అంజయ్య, శ్యామ్ రాథోడ్ మంద సరస్వతి, వెంకటనారాయణ యాదవ్, సత్యం, గంటేల విద్యాసాగర్, ఉపేందర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరామనవమికి విస్తృత ఏర్పాట్లు

- 26 సెక్టార్లుగా కల్యాణ మండపం విభజన
- ఉక్కపోత నుంచి ఉపశమనానికి కూలర్లు
- ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు
- తలంబ్రాల పంపిణీకి 60 కౌంటర్లు
- భద్రాద్రిలో భక్తుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్
- అధికారులతో సమీక్షలో భదాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6 : భద్రాచలంలో శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులకు కేటాయించిన విధులు పకడ్బందిగా నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో శ్రీరామనవమి, మహా పట్టాభిషేక కార్యక్రమాల నిర్వాహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. కళ్యాణ వేడుకలు నిర్వహించే మండపాన్ని 26సెక్టార్లుగా విభజించి, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు తిలకించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపధ్యంలో ప్రతి సెక్టార్లో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల వసతి (లాడ్జీ)లను ఆన్‌లైన్ బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించామన్నారు. ఆన్లైన్ ద్వారా టికెట్లు విక్రయాలు చేపట్టాల్నారు. ఇప్పటి వరకు 1330 టికెట్లు విక్రయంచామన్నారు.

మహోత్సవాల రోజుల్లో మాంసం, మద్యం విక్రయాలను నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సెక్టార్లో విధుల నిర్వాహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని డీపీఓను ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు 25జన్లుగా విభజించి ప్రతి జోన్‌కు ఓ ఎంపీఓతో పాటు నలుగురు కార్యదర్శులను నియమించాలన్నారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743-232444 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి సరఫరాకు పట్టనంలో 200 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు.

ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని మంచినీటికి ఇబ్బంది లేకుండా సరఫరా చేయాలన్నారు. మంచినీటి సరఫరా పర్యవేక్షణకు 30మంది ఏఈలు, మంచినీటి పరీక్షల నిర్వాహణకు 12మంది సిబ్బందిని నియమించాలని మిషన్ భగీరధ ఈఈ తిరుమలేష్‌ను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు నివారణకు అగ్నిమాపక వాహనాలను ఎస్టింగ్విష్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక అధికారిని ఆదేశించారు. రెస్క్యూటీములను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల వాహనాలపార్కింగ్ ప్రాంతాల్లో నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడింగ్ ఏర్పాటుతో పాటు నాటు పడవలను, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు.

స్వామివారి కళ్యాణ మండపానికి విచ్చేయునప్పుడు భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వంతెనలపై వాహనాలు ఆగిపోతే తక్షణమే తరలించేందుకు వీలుగా క్రేన్లు సిద్ధంచేయాలన్నారు. 24గంటలు పని చేసే విధంగా అత్యవసర వైద్య కేంద్రాలన ఏర్పాటు చేయాలని. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 20 బెడ్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ఐసీయూ వార్డులు సైతం ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు పరిశీలించాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం తలంబ్రాలు పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా 60కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఉత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపుకలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఓ పీఓ ప్రతీక్ జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఆర్‌డీఓ విద్యచందన, దేవస్థాన ఈవో రమాదేవి, డీఆర్ఓ రవీంద్రనాద్, ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు

- అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6: ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటుచేసి, నిఘాతో రక్షణ చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిపై భూ రక్షణ బృందాలు తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు.

ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ జీవో 59లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణ అయిన వాటి స్థలాలు వెంటనే స్వాధీనం చేసుకొని, ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సర్వే నెంబర్ 37లో స్వాతంత్ర్య సమరయోధులు, ఎక్స్ సర్వీస్‌మన్‌లకు కేటాయించిన 439ప్లాట్లలో ఓపెన్ ప్లాట్లు 267, తాత్కాలిక నిర్మాణాలు 54, శాశ్వత నిర్మాణాలు 11, బేస్ మెంట్ లు 106, పాక్షిక నిర్మాణాలు ఒకటి ఉన్నట్లు వీటిపై సమగ్ర విచారణ జరిపి, అసైన్దారులకు చట్టప్రకారం నోటీసులు ఇచ్చి, ఆధారాలతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పువ్వాడ ఉదయ్ నగర్‌లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు చేపట్టాలన్నారు. టేకులపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 33 ఇళ్లకు తాళాలు, 20ఇళ్లు అద్దెకు, ఒక ఇల్లు అమ్మడం జరిగిందని, వీటిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వస్థలాల్లో ఉన్న నిర్మాణాలు గుర్తించి తొలగించాలన్నారు. కోర్టు కేసుల్లో ఉన్న స్థలాలను ఫాలోఅప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

ఎర్రుపాలెం, ఏప్రిల్ 6: జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్ రావు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9వ తేదీ నుంచి 17వరకు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తొమ్మిది రోజులు వివిధ రకాల జప, అర్చన హోమాది కార్యక్రమాలతో పాటు శ్రీవారికి రోజుకొక వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న శ్రీదేవి, భూదేవిలను వధువులుగా, శ్రీవారిని వరుడిగా భావించి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించి అనంతరం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. చివరి రోజున సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం, మహాపూర్ణాహుతి, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

బీఆర్ఎస్ కార్యక్రమాలకు

'కందాల' దూరం

- కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు ప్రచారం

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పాలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కందాల ఉపేందర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరం పాటిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు అందరు పాలుపంచుకుంటున్నా.. పాలేరులో మాత్రం కందాల హాజరుకావడం లేదు. ఖమ్మంలో బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి అదేరోజు వద్దిరాజు రవిచంద్ర ఆత్మీయ సన్మానానికి కూడా కందాల హాజరు కాలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో జిల్లా కార్యాలయంలో కూడా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు సమావేశం జరిపినా హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశాలకు కూడా కందాల దూరంగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతు భరోసా దీక్షలకు శనివారం పార్టీ పిలుపునిచ్చింది. అన్నిచోట్లా మాజీ ఎమ్మెల్యేలు హాజరుకాగా కందాల మాత్రం పాలేరు నియోజకవర్గంలో పాల్గొనలేదు. పార్టీలో ముఖ్యనాయకులు ఎవరైనా మరణించినా, శుభకార్యక్రమాలు ఎక్కడైనా జరిగితే వ్యక్తిగతంగా వచ్చి వెళుతున్నారు తప్ప, పార్టీ కార్యక్రమాలకు మాత్రం గైర్హాజరవుతున్నారు. దీంతో కందాల పార్టీ మారుతారన్న ప్రచారం నియోజకవర్గంలో జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరేందుకు కందాల ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పాలేరు నియోజకవర్గంలో జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

ఆర్టీసీ ఆదాయం.. ల'హరి'

- ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు భిన్న చార్జీలు
- ఆన్‌లైన్‌లో తక్కువ చూపుతున్న రేట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 6: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చేందుకు కొత్తగా అంతరాష్ట్ర సర్వీసులను నడుపుతోంది. సాంకేతిక కారణాలో, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. లహరి బస్సు చార్జీలు గరుడ కన్నా తక్కువగా ఆన్‌లైన్‌లో కనిపిస్తుండటం ఇందుకు కారణమవుతోంది.

ఖమ్మం నుంచి బెంగళూరుకు రోజు రెండు లహరి సర్వీసులను నడుపుతున్నారు. ఖమ్మం నుంచి హైద్రాబాద్, వయా బెంగళూర్ వరకు ఈ సర్వీసులు నడుస్తున్నాయి. అంతరాష్ట్ర సర్వీస్‌లలో రద్దీని బట్టి టికెట్ రేట్లను తీసుకుంటారు. అయితే తెలంగాణా వ్యాప్తంగా ఒకే టికెట్ ఉండాల్సిన లహరి సర్వీసులు ఒక్కో బస్సుకు ఒక్కో టికెట్ రేట్లు ఉన్నాయి. భిన్న రేట్లను అధికారులు ఆన్‌లైన్లో పెట్టటంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు లహరి బస్సుల్లో ఒకే దూరానికి వేర్వేరు బస్సుల్లో టికెట్ల రేట్ల మధ్య వ్యత్యాసం ఉంది. దీంతో తక్కువ రేటు ఉన్న సర్వీసుల్లో మెదట టికెట్లు బుక్ అవుతున్నాయి. ఈ కారణానికి ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమా, సిబ్బంది బాధ్యతా రాహిత్యమా తెలియాల్సి ఉంది. దీనివల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది.

లహరి బస్సులలో టికెట్ రేట్ల వ్యత్యాసం రూ. 116లు ఉంది. ఖమ్మం నుంచి మధ్యాహ్నం బెంగళూరుకు వెళ్లే లహరి బస్సు సర్వీస్ నెంబర్ 8655లో ఖమ్మం నుంచి హైద్రాబాద్ వెళ్లడానికి టికెట్ ధర రూ.273 చూపుతోంది. సాయంత్రం వెళ్లే లహరి బస్సు సర్వీస్ నెంబర్ 1319లో మాత్రం రూ.389 కనిపిస్తోంది. కాగా ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు రాజధాని బస్సుల్లోనే రూ.389 చూపిస్తున్న టికెట్ (అదనపు చార్జీలు ఉంటాయి) లహరి బస్సులో కేవలం రూ.273 చూపించటం ఎంటాని పలువురు ప్రయాణికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు

ఈ విషయమై ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంకన్నను వివరణ కోరగా కేవలం అంతరాష్ట్ర సర్వీస్‌లలో మాత్రమే రద్దీని బట్టి టికెట్ల రేట్లలో హెచ్చు తగ్గులు ఉంటాయని, తెలంగాణా వ్యాప్తంగా ఒకే రేటు ఉంటుందన్నారు. ఆన్‌లైన్లో టికెట్ల వివరాలు చూసి సరిచేస్తామన్నారు.

చంద్రబాబుపై కేసీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం

● టీడీపీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జూలూరుపాడు, ఏప్రిల్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనుచిత వాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ జిల్లా నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత రంగ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ, అప్పటి సీఎం చంద్రబాబునాయుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయకుంటే, తాను చేశానని కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబానికి రాజకీయ జన్మనిచ్చినది టీడీపీయేనని, ఆ విషయాన్ని మర్చిపోయి చంద్రబాబును విమర్శించటం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే అన్ని వర్గాలకు సామాజిక, ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. టీడీపీపై విమర్శలు చేసి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందటానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ నాయకుడు చంద్రబాబునాయుడు, టీడీపీపై విమర్శలు చేస్తే కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు రోకటి నరసింహారావు, చావా వెంకటేశ్వర్లు, కోటంరాజు, పెంటికల వీరబాబు, తాళ్లూరి వీరబాబు, రమేష్, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన లోపంతో వరి పంటకు నష్టం

● డీలర్‌పై చర్యలు తీసుకోవాలని రైతుల ఫిర్యాదు

తల్లాడ, ఏప్రిల్ 6: విత్తన లోపంతో వరి పంటకు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని మండలంలోని రేజర్ల(అంజనాపురం), తెలగవరం, వెంగన్నపేట(గూడూరు) గ్రామాల్లో పలువురు రైతులు ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని ఓ విత్తన దుకాణంలో రైతులు హెచ్ఎంటీ సోనా వరి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. కాగా విత్తన లోపంతో ఎకరానికి ఐదారు బస్తాలు దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. శనివారం మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు పరిశీలించారు. ఇదిలా ఉండగా విత్తన లోపానికి కారణమైన విత్తన డీలర్‌పై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు.



విత్తన లోపమున్న వరిపైరును పరిశీలిస్తున్న ఏవో

అనుమతులు లేకుండా
ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు

● భద్రాద్రి డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శిరీష

బూర్గంపాడు, ఏప్రిల్ 6: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆయుర్వేదిక్, హోమియో, యునాని, ఫిజియోథెరపీ ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. శనివారం భద్రాచలంలోని అంజలి ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో గతంలో రిజిస్ట్రేషన్ కోసం సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో షోకాజ్ నోటీసు అందజేశామని తెలిపారు. అయినప్పటికీ వారిలో ఎటువంటి మార్పులు లేకుండా యథాతథంగా వైద్యశాలను నిర్వహిస్తుండటం పట్ల డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వైద్యశాలను సీజ్ చేస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మెయిద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ బేబి పాల్గొన్నారు.

అనుబోస్‌లో క్యాంపస్ సెలక్షన్స్

● ఉద్యోగాలు సాధించిన 70మంది విద్యార్థులు

పాల్వంచ, ఏప్రిల్6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేఎస్‌పీ రోడ్‌లోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మూడు ప్రముఖ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ సంస్థలు తమ సంస్థల్లోని గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, జూనియర్ టెక్నీషియన్ల నియామకం కోసం క్యాంపస్ సెలక్షన్స్ చేపట్టారు. సుమారు 200 మంది విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హులుగా నిర్ణయించారు. ఈ నియామకాల్లో అర్హత సాధించిన వారికి సంవత్సర ఆదాయంగా రూ.2.50 లక్షల జీతబత్యాలు ఉంటాయని నిర్వహకులు ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులు నెల రోజుల వ్యవధిలో కంపెనీ నందు రిపోర్టు చేసి ఉద్యోగంలో చేరాలని హెచ్‌ఆర్ మేనేజర్ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తలశిల భరత్‌కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, ప్రతిభను చాటి ఉద్యోగులుగా ఎంపికవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అవని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఇమ్మడి క్రాంతి కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాంపస్ సెలక్షన్స్‌కు హాజరైన విద్యార్థులు

పాలిటెక్నిక్ కోర్సులతో
సత్వర ఉపాధి

▸ ప్రవేశపరీక్షకు నోటిఫికేషన్ విడుదల ▸ ఉమ్మడి జిల్లాలో మూడు ప్రభుత్వ కళాశాలలు



మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మధిర, ఏప్రిల్ 6: శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలనుకునే విద్యార్థులకు డిప్లొమా కోర్సులు ఓ వరం. అందులో పాలిటెక్నిక్ కోర్సులు ఓ సువర్ణావకాశం. బంగారు భవితకు అందివచ్చే అవకాశం. మూడేళ్ల కోర్సు పూర్తి కాగానే చక్కటి ఉద్యోగ అవకాశాలు. పదోతరగతి తర్వాత విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సుతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువ. పదోతరగతి పరీక్షా ఫలితాలు రాగానే తర్వాత ఏ కోర్సు తీసుకోవాలి. ఎటువైపు వెళ్లాలనే సందిగ్ధం విద్యార్థుల్లో కలుగుతుంది. పది పాస్ అయిన తర్వాత ఇంటర్, ఆ తర్వాత ఎంసెట్, నీట్, లేదా డిగ్రీ, పీజీ కోర్సులు ఇలా ఎన్నోచేయాలనే ఆలోచన విద్యార్థుల మెదడును తొలుస్తుంది. కాని పదోతరగతి అనంతరం పాలిసెట్‌లో చేరితే తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యం అందిపుచ్చుకొని తొందరలోనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చు. మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేశాక నేరుగా ఇంజనీరింగ్ కోర్సులు చదివేందుకు అవకాశం ఉంది.

ఉమ్మడిజిల్లాలో పరీక్షా కేంద్రాలు

ఖమ్మం జిల్లా: ఖమ్మం, మధిర
కొత్తగూడెం జిల్లా: కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు

ఉద్యోగావకాశాలు పుష్కలం..

పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసినవారికి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇంజనీరింగ్, ఆర్‌అండ్‌బీ, ఎయిర్‌లైన్స్, మెట్రో, రవాణారంగం, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, డిస్కం, బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ, ఆర్మీ, నేవీ, సింగరేణి, రైల్వే, కార్పొరేట్ సంస్థలు, ఇవేకాక సాఫ్ట్‌వేర్ సంస్థల్లో చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఖమ్మం జిల్లాలో మధిర, కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, మణుగూరులలో ఉన్నాయి.

కోర్సుల వివరాలు

ఖమ్మం జిల్లాలో మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్‌లో-60, మెకానిక్‌లో-60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఫ్యాకల్టీ భవనం సదుపాయం, హాస్టల్ సదుపాయం ఉంది. కళాశాల 2008లో ప్రారంభమై ఇప్పటికి 15 బ్యాచ్‌లు కోర్సు పూర్తి చేసి వెళ్లారు. అనేక మంది వివిధ స్థాయిల్లో ఉన్నారు. కొత్తగూడెం జిల్లాలో సివిల్ -120, మెకానిక్-120, ఎలక్ట్రికల్- 60, మైనింగ్-60, మెటలర్జీ- 60, ఎలక్ట్రికల్ అండ్ ఇనిస్ట్రినల్-60 సీట్లు ఉన్నాయి. మణుగూరులో పూర్తిగా గిరిజన విద్యార్థుల కోసం గత ఏడాది ఏర్పాటు చేశారు. ఇతరులకు 5శాతం సీట్లు మాత్రమే ఉంటాయి. మణుగూరులో-60, ఎలక్ట్రికల్-60, మైనింగ్-60 సీట్లు ఉన్నాయి.

పాలీసెట్ ప్రకటన విడుదల

రాష్ట్ర సాంకేతిక విద్య శాఖ ఇప్పటికే పాలీసెట్ -2024 ప్రకటన విడుదల చేసింది. మే 24న పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుంది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహిస్తారు. ఈపరీక్షకు దరఖాస్తుచేసుకొనేందుకు ఈనెల 22వరకు అవకాశం ఉంది. ఆతర్వాత రూ. 100 అపరాధ రుసుంతో 24 వతేదీ వరకు తాత్కాల్‌లో రూ.300రూపాయల రుసుంతో ఈనెల 26వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి, తత్సమాన పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు.

పరీక్ష ఫీజులు

బీసీ, జనరల్ విద్యార్థులు రూ. 500, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ.250, పరీక్ష 2.30గంటలు సమయం ఉంటుంది. 150 మార్కులు చేయాలి

గణితం-60, భౌతిక శాస్త్రం-30, రసాయశాస్త్రం-30, జీవశాస్త్రం-30 మార్కులుంటాయి. పదోతరగతి సిలబస్ నుంచే ప్రశ్నలు ఉంటాయి.

ఉపాధి అవకాశాలు ఎక్కువ

● రాజ్‌కుమార్, ఖమ్మం జిల్లా కో ఆర్డినేటర్, మధిర, మణుగూరు కళాశాలల ప్రిన్సిపాల్

పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. టెన్త్ తర్వాత పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసి ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ఉన్నత చదువులకు వెళ్లలేని విద్యార్థులు డిప్లొమా పూర్తిచేసి ఉద్యోగం చేయవచ్చు. తక్కువ ఖర్చుతో ఇంజనీర్‌గా రాణించేందుకు అవకాశం ఉంది.

ఓటుహక్కు వినియోగంపై ప్రచారం కల్పించాలి

● కలెక్టర్ వీపీ గౌతమ్



సవవేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6: ఓటరుగా నమోదు, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యం తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. శనివారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్వీప్ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటుహక్కు అర్హత ఉన్న ప్రతిఒక్కరు ఓటుహక్కు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటుహక్కు పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, దాని ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తీసుకురావాలన్నారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని, స్వచ్ఛతా ఆటోలు, శానిటేషన్ ఆటోల ద్వారా ప్రచారం చేయాలన్నారు. కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు పొందేలా చూడాలన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో 2కే రన్లు నిర్వహించి, యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. నేలకొండపల్లి, ఖిల్లా తదితర చారిత్రక స్థలాల్లో స్వీప్ కార్యాచరణ చేయాలన్నారు. పెట్రోల్ బంక్‌లు, పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, పెద్ద వాణిజ్య సముదాయాల్లో సీ-విజిల్, ఓటర్ హెల్ప్ లైన్, 1950 టోల్ ఫ్రీ నెంబర్‌పై ప్రచార స్టాండీలు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి కొండపల్లి శ్రీరామ్, జడ్పీ సీఈవో వినోద్, డీపీవో హరికిషన్, డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో గణేష్, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్వోఓలు ప్రత్యూష, అరుణకుమారి, సీఎంవో రాజశేఖర్, మునిసిపల్ కమిషనర్లు వేణు, షఫీయుల్లా, రవిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్‌ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. విలువైన ప్రభుత్వ భూముల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, అన్యాక్రాంతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు తదితరులున్నారు.

సర్వేంద్రియానం నయనం ప్రధానం

▸ **జిల్లా ప్రధాన న్యాయాధికారి జగ్జీవన్‌కుమార్**



పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జగ్జీవన్‌కుమార్

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 6: మానవ అవయవాలన్నింటిలో కన్ను అత్యంత ప్రధానమైనదని దానికి జాగ్రత్తగా కాపాడుకోవలసిన అవసరం ఉందని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి జగ్జీవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయసేవా సదన్‌లో శరత్ మాక్స్‌విజన్ హాస్పిటల్, శ్రీరక్ష హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యా యాధికారులు ఉమాదేవి, రాంప్రసాదరావు, అర్చనాకుమా రి, మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, గోపిక నాగస్రావ్య, దీప, బిందుప్రియ, మాధవి, రజని, శాంతిలత, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, కాటంనేని రమేష్, కొత్త వెంకటేశ్వరరావు, రత్నాకరం శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

చీపురుగూడెంలో చెక్ డ్యాం నిర్మాణ పనుల అడ్డగింత

జూలూరుపాడు, ఏప్రిల్6: చెక్ డ్యాం నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్న సంఘటన శనివారం మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని చిపురుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. చిపురుగూడెం, బేతాళపాడు గ్రామాలకు చెందిన రైతుల భూములు 60 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.50కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. కాగా చిపురుగూడెం గ్రామానికి చెందిన కొందరు రైతులు చెక్‌డ్యాం నిర్మాణం వల్ల తమకు ఎలాంటి ఉపయోగం లేదని నిర్మాణ పనులను ప్రారంభించవద్దని అడ్డుకోగా.. మరి కొందరు రైతులు చెక్ డ్యాం నిర్మిస్తే తమ భూములకు సాగునీరు అందుతుందని నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో రైతుల ఇరు వర్గాల మధ్య చెక్‌డ్యాం నిర్మాణం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించలేదు. ఈ విషయమై ఐబీ మండల ఏఈ మీనాను వివరణ కోగా ఇద్దరు రైతులు మాత్రమే చెక్‌డ్యాం నిర్మాణాన్ని చేపట్టవద్దంటున్నారని, ఎక్కువ శాతంమంది రైతులు చెక్‌డ్యాంను నిర్మిస్తేనే తమకు ఉపయోగం ఉంటుందని అంటున్నారని తెలిపారు. సోమవారం నాటికి నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తిపై దాడి..కేసు నమోదు

పెనుబల్లి, ఏప్రిల్ 6: వ్యక్తిపై దాడి చేసిన కొందరిపై వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కోకిలంపాడుకు చెందిన కంభంపాటి రాంబాబు, ఎక్కిరాల సురేష్‌లతో పాటు మరి కొందరు ఈనెల 4న మద్యం సేవించేందుకు తెలంగాణలోని పెనుబల్లి మండలం గణేశులపాడులోని ఓ బెల్టుషాపునకు వచ్చారు. కాగా మద్యం సేవిస్తున్న సమయంలో రాజకీయ పార్టీల ప్రస్తావన వచ్చి రాంబాబు, సురేష్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు వీఎంబంజర్ ఎస్‌ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేటరూరల్, ఏప్రిల్ 6: మండలంలోని మొద్దులగూడెం, గుర్రాలచెరువు మార్గంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. అదే విధంగా గుమ్మడివల్లి పంచాయతీలోని కొత్తూరు గ్రామ సమీపంలో గల పెదవాగు నుంచి ఏ విధమైన అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం దగ్ధం

కల్లూరు, ఏప్రిల్ 6: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మండలంలోని చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి గ్రామాల్లో గల ప్రకృతి వనాలు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో నిప్పు పెట్టడంతోనే మంటలు వ్యాపించి సుమారు 3వేల మొక్కలు దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు. మండల పరిషత్ అధికారి చంద్రశేఖర్, ఈవోఆర్డీ సురేష్‌బాబు, ఈజీఎస్ పీవో హేమమాలిని, సిబ్బందిలు సందర్శించి పరిశీలించారు.

తీర్థాల ఆలయంలో 10న వేలం

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 6: మండల పరిధిలోని తీర్థాల సంగమేశ్వర ఆలయంలో 2024 ఏప్రిల్ 10 నుంచి 2025 ఫిబ్రవరి 20వరకు లడ్డూ ప్రసాదం, పులి హోర కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం కోసం ఈనెల 10న ఆలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో శేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

యువకుడి అప్పగింత

ఖమ్మం క్రైం, ఏప్రిల్6: ఓఇంటిలో నల్లాలు చోరీ చేసిన యువకుడిని పట్టుకుని స్థానికులు శనివారం ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులకు అప్పగించారు. నగరంలోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంటిలో ఇటీవల ఇద్దరు యువకులు నల్లాలు చోరీ చేశారు. ఈసంఘటన అంతా సీసీ కెమారాలలో రికార్డు అయ్యింది. వారిలో ఓ యువకుడు శనివారం రాత్రి తిరుగుతుండటంతో గుర్తించిన స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పాల్వంచ, ఏప్రిల్ 6: దొంగతనానికి పాల్పడిందనే అనుమానంతో ఓ మహిళలను పాల్వంచ పట్టణ పోలీసులు శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని తాళం వేసి ఉన్న ఓ క్వార్టర్‌లో నుంచి బీరువాను తరలిస్తుండగా స్థానికులు గుర్తించారు. వెంటనే ఎస్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పాల్వంచ టౌన్ ఎస్‌ఐ బాణాల రామును వివరణ కోరగా పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని, సదరు మహిళపై ఫిర్యాదు చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదని తెలిపారు.

తలసీమియా చిన్నారులకు ఉచితంగా బోన్‌మ్యారో చికిత్స చేయిస్తాం

● వికాస తరంగిణి సభ్యుడు పాలాస్ శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6: తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా బోన్ మ్యారో చికిత్స చేయిస్తామని వికాస తరంగిణి బాధ్యులు పొలాస్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తలసేమియా చిన్నారుల కోసం 14 ఏళ్లకు పైగా నిరంతరాయంగా సేవలందిస్తున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రతి ఏడాది ఒక చిన్నారికి బోన్ మ్యారో చికిత్స ఉచితంగా చేయిస్తామన్నారు. డే కేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకునే చిన్నారులకు అన్నదానం చేస్తామన్నారు. వైద్యు లు డాక్టర్ జితేందర్, డాక్టర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి అని సూచించారు. వేసవిలో చిన్నారులకు రక్తం అందడం లేదని, దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్, సంస్థ సభ్యులు పి.అనిత, వికాస తరంగిణి బాధ్యులు శాంతి తదితరులు పాల్గొన్నారు.

నగదు కోసం బండి తీసుకెళ్లడంతో..

● మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సత్యసాయి

కామేపల్లి, ఏప్రిల్ 6: అప్పుగా తీసుకున్న నగదు కోసం స్నేహితుడు తన బైక్‌ను తీసుకెళ్లడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలం జోగ్గూడెం గ్రామంలో శనివారం జరిగింది. జోగ్గూడెం గ్రామానికి చెందిన సత్యసాయి(25) పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన బట్టు పవన్ అనే యువకుడి వద్ద కొంత నగదును అప్పుగా తీసుకున్నాడు. కాగా ఆ యువకుడు నగదు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పాటు అతడి ద్విచక్ర వాహనాన్ని లాక్కొనిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సాయి ఈ నెల 30న తన వ్యవసాయ భూమిలో కలుపు మందు తాగాడు. కాగా పురుగుల మందు తాగానని మరో స్నేహితుడు నవీన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఈ విషయాన్ని అతడి తండ్రికి సమాచారం అందించాడు. వెంటనే అతడిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చిన్న శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 6: ఒరిస్సా రాష్ట్రం నౌపడ జిల్లా జంక్ పోలీస్ పరిధిలోని జాల్‌బహల్ గ్రామానికి చెందిన మాన్సాంగ్‌ను శనివారం ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులకు అన్నం ఫౌండేషన్ సభ్యులు అందించారు. 8ఏళ్ల క్రితం ఖమ్మం నగరంలో మతిస్థిమితం కోల్పోయి రోడ్డు వెంట వెళ్లే వారిపై దాడి చేస్తూ, భయాందోళనలు చేస్తు న్న వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ వ్యక్తిని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. వైద్య సేవల అనంతరం ఆ వ్యక్తి పేరు, ఊరు చెప్పడంతో ఆ వివరాల ప్రకారం కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ సభ్యులు సమాచారం అందించారు. వారు ఖమ్మం వచ్చేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని తెలపడంతో, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు పోలీసుల సమక్షంలో మాన్సాంగ్‌ను ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆశ్రమంలో చేసిన సేవలకు అతడికి రూ.25వేలు, 50 కేజీల బియ్యాన్ని అందించారు. అన్నం సేవలకు కుటుంబ సభ్యులు వారు కృతజ్ఞతలు తెలిపారు.



మాన్సాంగ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

కల్లూరు ఏప్రిల్ 6 సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యంలో ముస్లింలకు శనివారం స్థానిక జామే మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావులు ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, ఎస్‌కే కమ్లి, నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, సీహెచ్ కిరణ్, మండల ముస్లిం సదరు సయ్యద్‌అలి, హనీఫ్, మైనార్టీ నాయకులు రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నేడు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 6: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం టీజీవో కార్యాలయంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తెలిపారు.

ఎడవల్లిలో సాగర్ నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు

ముదిగొండ, ఏప్రిల్ 6: మండలంలోని ఎడవల్లి గ్రామం వద్ద సాగర్ కాల్వలో ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని శనివారం ఐబీ, పోలీసు అధికారులు పరిశీలించారు. తాగునీటి ఎద్దడిని నివారించే దానిలో భాగంగా పాలేరు నుంచి వైరాకు నీటిని విడుదల చేశారు. ఆ నీటి ప్రవాహాన్ని అధికారులు పరిశీలించారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

పెనుబల్లి, ఏప్రిల్ 6: పెనుబల్లి గ్రామంలో ముత్యాలమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, రెండు హుండీలు, బీరువాను పగులగొట్టి అందులోని కానుకలు, నగదు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.పదివేల కానుకలను ఎత్తుకెళ్లిన పెద్దగౌడ్ వంగా కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక డంప్ స్వాధీనం

పాల్వంచ, ఏప్రిల్ 6: పట్టణ పరిధిలోని కుంటినాగులగూడెం, గుర్రాలకుంట ప్రాంతాల్లో కొందరు అక్రమంగా ఇసుకను నిల్వ చేశారనే సమాచారం మేరకు పాల్వంచ టౌన్ ఆర్ఐ రవికుమార్‌రెడ్డి, రూరల్ ఆర్ఐ హచ్చలు రెండు డంప్‌లను గుర్తించి సీజ్ చేశారు. సుమారు ఆరు లారీల ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

ముగిసిన న్యాయవాద సహకార సంఘం
ఎన్నికల నామినేషన్లు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 6: ఖమ్మం జిల్లా న్యాయవాదుల సహకార సంఘం ఎన్నికలు(4)నలుగురు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికలు ఈనెల 16న ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించేందుకు ఎన్నికల అధికారి గుద్దేటి రమేష్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ నామినేషన్లు ఈనెల 4 నుంచి 6వతేదీ వరకు వచ్చినవి అనుమోలు నర్సింహారావు, భూక్యా రమేష్, పలివల శ్రీలక్ష్మి, గోరింట్ల శాంతారావు, చుంచుల మల్లిఖార్జునరావు, దేవకి శ్రీనివాసరావులు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారి శనివారం ప్రకటించారు. ఫైనల్ లిస్ట్ 10న ప్రకటిస్తామని, పోలింగ్ 16న జరుగుతుందని, కౌంటింగ్ ప్రక్రియ అదేరోజు సాయంత్రం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

ఆరు మట్టి లారీల సీజ్

రఘునాథపాలెం, ఏప్రిల్ 6: ఖమ్మంనగరానికి సమీపంలోనే ఉన్న బల్లేపల్లి చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఆరు మట్టి లారీలను శుక్ర, శనివారాల్లో అర్బన్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు ఖమ్మం నగర ప్రవేశాల దారుల వద్దనే పట్టుకున్నారు. అయితే శనివారం రాత్రి పత్రాలు చూపించి కొన్ని లారీలను విడిపించినట్లు సమాచారం.

చంద్రబాబుపై నోరు పారేసుకుంటే మరోసారి బుద్ధి చెబుతారు: టీడీపీ

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 6: మాజీ సీఎం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిర్మాత నారా చంద్రబాబు నాయుడుపై నోరు పారేసుకుంటే ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెబుతారని తెలుగుదేశం పార్టీ నాయకులు కేతినేని హరీష్ చంద్ర అన్నారు. చంద్రబాబు నాయుడుపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ప్రజల తిరస్కారానికి గురైన కేసీఆర్ మతి తప్పి మాట్లాడుతున్నారని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబుపై కేటీఆర్ నోరు పారేసుకోవడం వలనే టీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పంపించారన్న నిజాన్ని తెలుసుకోవాలన్నారు. టీఆర్ఎస్‌కు భవిష్యత్తులో 10 శాతం ఓటు బ్యాంకు కూడా మిగలదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కొలికొండ మురళి, నరేందర్, తాళ్లూరి నారాయణరావు, కూచిపూడి జై, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

నియోజకవర్గాల్లో రైతు భరోసా దీక్షలు
హాజరైన ఎంపీ నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా


దీక్షలో పాల్గొన్న కమల్‌రాజు

హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్

జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిరటౌన్,ఏప్రిల్6: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇచ్చిన హామీలను మరిచి గాలికి వదిలేసిందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శనివారం మధిరలో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జరిగిన రైతుగోస దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీరు అందక రైతులు పంటలు ఎండి నష్టపోయారని వీరికి ఎకరాకు రూ.25వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, వెంటనే రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బందం శ్రీను బిఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణప్రసాద్, సోషల్ మీడియ ఇంచార్జ్ తాళ్లూరి హరీష్, యూత్ అధ్యక్షులు కూన నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్, రైతుబంధు కన్వీనర్ చావా వేణు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు నాయకులు బీవీఆర్, కరివేద సుధాకర్, ప్యారీ, ఇందిర కౌన్సిలర్లు సయ్యద్ ఇక్బాల్, బిక్కి అనిత, గద్దల మాధురి, కోఆప్షన్ మెంబర్ కొరారి రాఘవ తదితరులు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ నామా

రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర

వైరా, ఏప్రిల్ 6: రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. శనివారం వైరాలో మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షా శిబిరంలో ఎంపీలు నామా, వద్దిరాజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. సాగునీరందక రైతులు వేసిన పంటలు తీవ్రంగా నష్టపోయారని, ఎకరం ఒక్కింటికి రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆక్షేపించారు. రైతు సమస్యలు పరిష్కరించేవరకు పోరాడతామని తెలిపారు. మదన్‌లాల్‌తోపాటు బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, సిరిపురం ఎంపీటీసీ మట్టూరి కృష్ణారావు, కౌన్సిలర్లు వనమా విశ్వేశ్వరరావు, దారెల్లి పవిత్రకుమారి, నాయకులు బోడపోతుల బాబు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, కొత్తా వెంకటేశ్వరరావు, మాదినేని ప్రసాద్, గుజ్జర్లపూడి దేవరాజు పాల్గొన్నారు.


కల్లూరులో మాట్లాడుతున్న ఎంపీ నామ

నీళ్లివ్వకుండా పంటలు ఎండబెట్టారు

ఎంపీ నామా, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, ఏప్రిల్6: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సాగునీరు ఇవ్వకుండా పంటలను ఎండబెట్టారని ఎంపీ నామా నాగేశ్వరరావు,రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం కల్లూరులో సత్తుపల్లి నియోజవకర్గ రైతుభరోసా దీక్ష కార్యక్రమం నిర్వహించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి సాగునీరు అందించి తెలంగాణ అంతటా పంటలను కాపాడిన ఘనత కేసీఆర్ దేనన్నారు. నాలుగు నెలలుగా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఇబ్బందులను గురిచేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిపోతే మరమ్మతులు చేయకుండా దానిని సాకుగా చూపిస్తూ కేసీఆర్‌ను బద్నాం చేయటానికి పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, గొర్ల సంజీవరెడ్డి, లక్కినేని అలేఖ్య, కొత్తూరి ఉమామహేశ్వరరావు, సుమలత, దొడ్డశ్రీనివాసరావు దుగ్గివర వెంకట్‌లాల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌ది

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మంరూరల్, ఏప్రిల్6: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం రూరల్ మండలం, వరంగల్‌క్రాస్‌రోడ్డులో శనివారం పాలేరు నియోజకవర్గ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో నాలుగునెలల్లోనే వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 500 బోనస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మీ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, వీరయ్య, బ్రహ్మయ్య, ఎంపీపీ బెల్లం ఉమా, జెడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, వైస్ ఎంపీపీ దరగయ్య పాల్గొన్నారు.

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

రఘునాథపాలెం, ఏప్రిల్6: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కనీసం రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఇవ్వలేక పోయిందని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఇవ్వలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరునాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతులకు సాగునీరు ఇవ్వాలంటూ ఖమ్మం నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమం రఘునాథపాలెం మండలం మంచుకొండ కూడలిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరునాయక్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోను అమలు చేయటంలో విఫలమైందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వలేదని, ఆసరా పింఛన్లు రూ.4వేలకు పెంచలేదని ఆరోపించారు. రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించేందుకు ప్రతి గ్రామంలో ప్రచారం చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెపుతారని విమర్శించారు.

కనిపించని లబ్ధిపొందిన నాయకులు

ఖమ్మం నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమంలో ముఖ్యమైన బీఆర్ఎస్ నాయకులు డివిజన్, మండల స్థాయిలోని మాజీ ప్రజాప్రతినిధులు సైతం హాజరు కాకపోవటం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెంట ఉండి భారీస్థాయిలో కాంట్రాక్టు పనులు చేసిన నాయకులు కూడా నిరసన కార్యక్రమానికి హాజరు కాలేదు. మండల బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమానికి వచ్చి పదేపదే ఫోన్లు చేసినా ప్రయోజనం లేక పోవటంతో వైస్‌ఎంపీపీ గుత్తారవికుమార్, వీరునాయక్ నిరసన కార్యక్రమం చేపట్టారు. భూక్య లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ రాణిశంకర్, కుర్రా భాస్కర్‌రావు, కాపా భూచక్రం, పెంట్యా, ధరావత్ మోహన్, మంద విజయ్, లక్ష్మా, బానోత్ రవి, అంగోత్ బాబు, ఎండీ పాషా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరునాయక్
మంచుకొండలో ఖమ్మం నియోజకవర్గ నిరసన కార్యక్రమం
కనిపించని బీఆర్ఎస్ కీలక నాయకులు


మంచుకొండలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

శ్రీకృష్ణ మందిరానికి చేరుకున్న విగ్రహాలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్6: తమిళనాడులోని మహాబలిపురం నుంచి తీసుకువచ్చిన రుక్మిణ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలను ఊరేగింపుగా సత్తుపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌లో శ్రీ కృష్ణమందిరానికి ఆలయన కమిటీ సభ్యులు తీసుకొచ్చారు. శనివారం పట్టణంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ విగ్రహాలను మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పువ్వులు జల్లుతూ తరలించారు. ప్రత్యేకరథంలో వచ్చిన విగ్రహాలను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంత భక్తులు తరలి వచ్చారు. కొబ్బరికాయలు కొట్టి నీళ్లపోసి విగ్రహాలకు స్వాగతం పలికారు. కాగా ఈనెల 13న ఈ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తుంది.


ఊరేగింపుగా వస్తున్న ఉత్సవ విగ్రహాలు

నేడు వైరాలో విద్యుత్ కోత

వైరా, ఏప్రిల్ 6: 33కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం వైరా మండలంలో కరెంట్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏడీఈ రామకృష్ణ తెలిపారు. ఉదయం 7నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్6: సత్తుపల్లి పట్టణంలోని జీవీ మాల్ ఎదుట సత్తుపల్లి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం శనివారం ప్రారంభించారు. 23ఏళ్లగా చుట్టుపక్కల ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏటా ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మొరిశెట్టి సాంబశివగుప్తా, భాస్కర్, గడ్డం శ్రీనివాస రావు, సయ్యద్ గౌస్, బాబు, సుబానీ, రంజిత్, పాషా, మిద్దే శ్రీను, జీ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చింతకాని,ఏప్రిల్6: మండల కేంద్రంలో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. చెన్నకేశవ స్వామి మాజీ ఆలయ చైర్మన్ కిలారు జగన్మోహనరావు, మాజీ సర్పంచ్ కిలారు సరోజిని దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విందులో ముస్లీంలు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు కిలారు మనోహర్‌బాబు, వేణుగోపాల్, షేక్ సైదులు, షేక్ జానిమియా, షేక్ రహమ్మతుల్లా, షేక్ ముజీమ్ పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ

ఖమ్మంకార్పొరేషన్,ఏప్రిల్6:2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తిపన్ను చెల్లిస్తే వారికి పన్నుపై 5శాతం రాయితీ ఇస్తామని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు పన్ను చెల్లించవచ్చన్నారు. నగర పాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో, మీసేవా కేంద్రాల్లో, బిల్‌కలెక్టర్ల వద్ద ముందస్తు ఆస్తిపన్ను చెల్లించవచ్చన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో ముందస్తు ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

అర్హులంతా ఓటుహక్కు కలిగిఉండాలి

కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్6: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగిఉండాలని, తప్పనిసరిగా ఓటు వేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని, వేరేప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఈ ప్రాంతంలోనే ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. తమ దుకాణాలకు, ఆస్పత్రులకు, హోటళ్లకు వచ్చేవారికి కూడా ఓటుపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతేకాకుంగా తమ వద్ద పనిచేసే సిబ్బంది కూడా ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటును తప్పనిసరిగా వేసేలా చూడాలని కమిషనర్ కోరారు. ఆయా ప్రాంతాల్లో ఓటు ప్రాముఖ్యతను వివరించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు.షాపింగ్‌మాల్, ఆస్పత్రుల్లో పనిచేసేవారి ఓటరు జాబితాను అందచేయాలని అధికారులను ఆదేశించారు. షాపుల్లో ఓటరు చైతన్యవంతానికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఆర్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రముఖ మోటివేషనల్ ఆకెళ్ళ రాఘవేంద్ర
- ఘనంగా శ్రీచైతన్య పాఠశాలల వార్షికోత్సవం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాఘవేంద్ర

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్6: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని అన్ని శ్రీచైతన్య పాఠశాలల కలిపి ఈఏడాదితో 15సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వేడుకలను శనివారం ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్‌విస్టా నూతన పాఠశాలలో నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫెమా కన్వినర్ మువ్వ శ్రీనివాసరావు, విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ , విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కాకుండా పుస్తకాల అలవాటు పెంచాలన్నారు. పుస్తకం అనేది వీసా లేకుండా విశ్వదర్శనం చేయిస్తుందన్నారు. 2008లో కేవలం 135 మంది విద్యార్థులతో ఒకేఒక్క క్యాంపస్‌లో ప్రారంభమైన శ్రీచైతన్య జూనియర్ కళాశాల నేడు పాఠశాల స్థాయిలోకూడా శాఖోపశాఖలుగా విస్తరించిందన్నారు. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేసిన శ్రీచైతన్య గ్లోబల్ విస్టా స్కూల్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్వో వాటర్‌ప్లాంట్ వితరణ


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్6: చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీఇన్‌ఫో సిస్టమ్ సొల్యూషన్స్ సంస్థ శనివారం ఖమ్మం శాంతినగర్ ఉన్నత పాఠశాలలో ఆర్వోవాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చేతన ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రంగారావు, సభ్యులు దొడ్డా సీతారామయ్య మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగానే గత నెలలో ఖమ్మం మోమినూన్ పాఠశాలలో ఆర్వోప్లాంట్ అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పసుమర్తి రంగారావు, దొడ్డా సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, హెచ్‌ఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

కొణిజర్ల, ఏప్రిల్ 6: నేడు కలెక్టరేట్ ఎదుట కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా నిర్వహించే ఒక్కరోజు సామూహిక సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆమ్‌ఆద్మీజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, పుల్లయ్య శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి సండ్ర పరామర్శ

పెనుబల్లి,ఏప్రిల్6: బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు చెలికాని రాజబాబు తల్లి చెలికాని సావిత్రమ్మ గత గురువారం అనారోగ్యంతో మృతి చెందా టరు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం రాజబాబును పరామర్శించారు. కార్యక్రమంలో కోటగిరి సుధాకర్‌బాబు, ప్రభాకర్‌రావు, రమేష్‌బాబు, రవిబాబు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి తుళ్లూరు

కొణిజర్ల,ఏప్రిల్6:పేదల సమస్యల పరిష్కారానికి శ్రమించిన వారిలో తుళ్లూరు చిన్నసత్యం ఒకరని సీపీఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని తనికెళ్లలో జరిగిన చిన్నసత్యం వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, ఎర్రాబాబు, పీవిరావు, కవిడ వీరభద్రం, తల్లూరు రమేష్, మురళి, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు, గుమ్మిడెల్లి సైదారావు, నాగరాజు, కట్ల సత్యం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మధిరటౌన్, ఏప్రిల్ 6: ప్రతీ ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని మధిర కోర్టు ప్రధాన న్యాయాధికారి కార్తీక్‌రెడ్డి అన్నారు. శనివారం మధిరలోని బస్తీ దావఖానాలో న్యాయసేవాసాధికార సమితి, దెందుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన వరల్డ్ హెల్త్‌డే కార్యక్రమంలో మాట్లాడారు.ఈ కార్య క్రమంలో వైద్యులు పృథ్వీ, వెంకట్‌లాల్, జాహ్నవి, సీడీపీవో శారదాశాంతి పాల్గొన్నారు.

ఏడేళ్లుగా వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయం

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు


మందులు పంపిణీ చేస్తున్న నున్నా

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్6: ఏడేళ్లుగా నిర్విరామంగా బోడేపూడి విజ్ఞాన కేంద్రం, ఖమ్మం రెండో పట్టణం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అభినందించారు. బీవీకే ఆధ్వర్యంలో శనివారం మంచికంటి భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో నగరంలోని ప్రముఖ వైద్యులతో కలిసి మందులు పంపిణీ చేశారు. మందులు తక్కువ ధరలకు అందించేందుకు బీవీకే ఆధ్వర్యంలో జనరిక్ మందుల దుకాణం ప్రారంభిస్తున్నామన్నారు. నాయకులు వై విక్రమ్, వై శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, శివనారాయణ, నర్రా రమేశ్, రామారావు, పీ వాసు, అప్జల్, గుమ్మడి బిక్షం, పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వండర్ కిడ్స్ వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 6: ఖమ్మం నగరంలోని వండర్‌కిడ్స్ పాఠశాల 24వ వార్షికోత్సవాన్ని శనివారం వర్తక సంఘం భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మువ్వా శ్రీనివాస్ రావు, 3టౌన్ సీఐ రమేష్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు హాజరయ్యారు. ఉత్తమ కరస్పాండెంట్ అవార్డు పొంది సుమారు 40మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ, అతి తక్కువ ఫీజుతో ఐఐటీ ఫౌండేషన్ విద్యనందిస్తున్నారని యాజమాన్యాన్ని అభినందించారు. కరస్పాండెంట్, సెక్రటరీ శశిధర్ రెడ్డి , డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

జిల్లా పరిషత్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్6: జిల్లా పరిషత్ కార్యాలయంలో సందర్శకుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం జడ్పీ సీఈవో వినోద్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో సందర్శకులు, ప్రజలకు దాహార్తిని తీర్చడానికి దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో నాగలక్ష్మీ, సిబ్బంది రామకృష్ణారెడ్డి, వంశీ పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీవో రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తుమ్మలపల్లి కృష్ణ రమేష్, గ్రా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రిటైర్డు సింగరేణి అధికారి ఆరెం రామయ్య, మండల పరిషత్ , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగొండ: ముదిగొండ ప్రధాన సెంటర్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీవో శ్రీధర్‌స్వామి ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నర్సింహారావు, ఎంపీవో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.